నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, బుధవారం 3 జూలై 2024 | NIZAMABAD






పెద్దకర్మ

మా ఇంటి దేవత మా కంటి వెలుగు మమతానురాగాల పుణ్యమూర్తి మా అందరి అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన త్యాగశీలి మీ మరణం మాకు తీరనిలోటు మీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...

శోకతప్తహృదయాలతో...

భర్త: కుందెన సత్తయ్య

కుమారులు - కోడళ్ళు: కుందెన రాజేంద్ర ప్రసాద్ - ఉమాలక్ష్మి, కుందెన రవీంద్రనాథ్ - సుమిత్ర

కూతుళ్ళు - అల్లుళ్ళు: శ్రీమతి పాశికంటి లక్ష్మి - మురళీధర్, శ్రీమతి బిట్ల పద్మ - కిషన్

మనుమళ్ళు: కుందెన సాయి ..., సాయి ..., సాయి ...; పాశికంటి శ్రీహర్ష - శ్రీమతి ..., బిట్ల ...

మనుమరాలు: శ్రీమతి ...

కార్యస్థలం : తేది: 03-07-2024 బుధవారం మధ్యాహ్నం మా స్వగృహము MIG-II/42, న్యూహౌజింగ్‌బోర్డ్ కాలనీ, వినాయక్‌నగర్, నిజామాబాద్ నందు జరుపబడును.

నోట్: ఇదే కార్డుగా భావించగలరు


# చదవాలంటే నడవాల్సిందే..

- కిలోమీటర్ల మేర నడవాల్సిన పరిస్థితి
- సమయానికి రాని బస్సులు...వచ్చినా బస్సులన్నీ ఫుల్
- గంటల తరబడి రోడ్లపై నిరీక్షణ
- వేలాడితే తప్ప.. టైముకు వెళ్లలేని దుస్థితి

నమస్తే తెలంగాణ ఫోకస్

బస్సు సౌకర్యం లేక విద్యార్థుల అవస్థలు

కామారెడ్డి/బోధన్, జూలై 2: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సుఖం, సురక్షితం అంటూ అధికారులు ఒకవైపు ప్రకటిస్తున్నారు. మరోవైపు సమయపాలన ఉండదు. వేళకు సరిగ్గా బస్సులు రావు అన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నత విద్య కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వెళ్లే విద్యార్థులకు రవాణా కష్టాలు తప్పడం లేదు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పలు గ్రామాలకు అసలు బస్సు సౌకర్యమే లేకపోవడంతో విద్యార్థులు కిలోమీటర్ల మేర నడవాల్సిన పరిస్థితి నెలకొన్నది. బస్సు సౌకర్యం ఉన్న గ్రామాలకు సైతం సమయానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్, ఆపై చదువులు చదివే వాళ్లు మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. పాఠశాల సమయంలో బస్సులు తగినన్ని లేకపోవడం, వచ్చినా రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. ఫుట్‌బోర్డులపై ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. సమయానికి పాఠశాల, కళాశాలకు వెళ్లాలంటే ఈ ఫీట్లు తప్పవని విద్యార్థులు వాపోతున్నారు. గత్యంతరం లేక ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంటున్నది.

**తగ్గిన బస్సు సర్వీసులు..**

పలు గ్రామాలకు బస్సు సర్వీసులను సైతం తగ్గించినట్లు తెలుస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకంతో బస్సులన్నీ రద్దీగా వస్తున్నాయని, దీంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులందరికీ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలలకు వెళ్లేందుకు కిలోమీటర్ల మేర విద్యార్థులు నడవాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



బోధన్ మండలంలోని ఖండ్‌గాంలో బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు



సాటాపూర్ చౌరస్తా వద్ద బస్సు కోసం విద్యార్థినుల ఎదురుచూపులు

## ఆటోల్లోనే బడికి..

రెంజల్, జూలై 2 : రెంజల్ మండలం బాగేపల్లి, కునేపల్లి, కళ్యాపూర్,కిసాన్ తండా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. ఈ గ్రామాల విద్యార్థులు చదువుకునేందుకు రెంజల్ మండల కేంద్రానికి వెళ్లాల్సి ఉండగా ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇదే మండలంలో తాడ్‌బిలోలి, కందకుర్తి రూట్‌లో కొన్ని సర్వీసులు నడుపుతున్నా అవి కాస్తా నిండిపోతుండడంతో విద్యార్థినులు బస్సు ఎక్కేందుకు కుస్తీ పడుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేక సాటాపూర్, తహసీల్ కార్యాలయ చౌరస్తాల వద్ద గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉన్నది.

## బస్సులను పెంచాలి..

కందకుర్తి రూట్‌లో బస్సు సర్వీసులను పెంచాలి. ఉదయం, సాయంత్రం మాత్రమే నడపడంతో ఉన్న ఆ బస్సులో సైతం మహిళలే నిండిపోతున్నారు. పాఠశాలకు వెళ్లేందుకు రోజూ బస్సులో నిలబడి వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నది. రోడ్డు బాగున్నా బస్సులు సరిగా నడపడం లేదు.

**- కందారే కార్తిక, 9వ తరగతి విద్యార్థిని, మోడల్‌స్కూల్, గ్రామం కందకుర్తి**



## సమాయానికి రాక.. క్లాసులకు అందక ఇబ్బందులు..

బోధన్ రూరల్, జూలై 2: బోధన్ మండలంలోని ఖండ్‌గాం గ్రామానికి బస్సు సౌకర్యం ఉన్నా.. సమయానికి రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాథమికోన్నత పాఠశాల అనంతరం పైచదువుల కోసం బోధన్, సాలూరాకు వెళ్లాల్సి వస్తున్నది. బస్సు సమయానికి రాకపోవడంతో సకాలంలో పాఠశాలకు చేరుకోలేక.. మొదటిక్లాసు మిస్సవుతున్నారు. బస్సును సకాలంలో నడపాలని కోరుతున్నారు.



శక్కర్‌నగర్‌లోని మధుమలంచ హైస్కూల్‌కు సైకిల్‌పై వెళ్తున్న విద్యార్థులు

## దారి బాగున్నా.. బస్సు లేదు

శక్కర్‌నగర్, జూలై 2: బోధన్ మున్సిపాలిటీలో విలీనమైన నర్సాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు పైచదువు కోసం కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి. సుమారు 200మంది విద్యార్థులు ఐదో తరగతి పూర్తి కాగానే పైచదువుల కోసం రెండు కిలోమీటర్ల దూరంలోని బోధన్, మూడు కిలోమీటర్ల దూరంలో ఎడపల్లి పాఠశాలలకు వెళ్తున్నారు. రహదారి బాగానే ఉన్నా... బస్సు సౌకర్యం లేదు.

## బస్సును రద్దు చేశారు..



బస్సును సడెన్‌గా రద్దు చేశారు. గ్రామంలో చాలా మంది విద్యార్థులం కాలినడకనే పాఠశాలకు వెళ్తున్నాం. మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి. అది కూడా పాఠశాలల సమయానికే నడపాలి. మా గ్రామం నుంచి అక్కయ్యలు పాఠశాలలకు రావాలంటే ఇబ్బందిగా ఉన్నది.

**-బి. నవదీప్, 9వ తరగతి, నర్సాపూర్.**



వర్ని మండలం కోటయ్య క్యాంపులోని మాడల్ స్కూల్‌కు ఆటోలో, నడుచుకుంటూ వస్తున్న విద్యార్థులు

వర్ని, జూలై 2: వర్ని మండలంలోని పాత వర్ని, హుమ్నాపూర్ తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో చదివే విద్యార్థులు సకాలంలో చేరుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్ని నుంచి కోటయ్య క్యాంపులోని తెలంగాణ మోడల్ పాఠశాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం సకాలంలో లేక కాలినడకన, ఆటోలను ఆశ్రయిస్తున్నారు. హుమ్నాపూర్ నుంచి పాత వర్నిలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



మాచాపూర్ నుంచి మల్లయపల్లి గ్రామానికి కాలినడకన వస్తున్న విద్యార్థులు

## సమయానికి రావు.. వచ్చినా ఆపరు..

ఎల్లారెడ్డి, జూలై 2: ఎల్లారెడ్డి మండలంలోని చాలా గ్రామాల్లో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు నాలుగు నుంచి ఆరు కిలోమీటర్ల వరకు ప్రతిరోజు నడక తప్పడం లేదు. సమయానికి బస్సులు రాకపోవడం.. వచ్చినా నిలపకపోవడంతో వందలాది మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని మాచాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శివ్వానగర్, దాల్మల్కపల్లి, రేపల్లె వాడ, మల్లయపల్లి గ్రామాల నుంచి విద్యార్థులు వెళ్తున్నారు. వీరికి ఎల్లారెడ్డి నుంచి మెదక్ వెళ్లే ఆర్టీసీ బస్సు సమయానికి రాకపోవడంతో కాలినడకన, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తున్నది.

## మూడేండ్లుగా సైకిల్‌పై వెళ్తున్నా..

గేటు వద్ద బస్సు ఆపకపోవడంతో సైకిల్ కొనుక్కున్నా. మూడేండ్లు నడుచుకుంటూనే బడికి వెళ్లాను. ఈ సంవత్సరం ఐదు వేలు పెట్టి సైకిల్ కొనుక్కున్నా. మేస్త్రీ పని చేసే మా నాన్న కష్టపడి సైకిల్ కొనిచ్చాడు. ఆర్టీసీ బస్సులు గేటు వద్ద ఆపితే మా ఊరి నుంచి 20మంది బస్సులో బడికి వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుంది.

**- శ్రీధర్, 8వ తరగతి, మల్లయపల్లి**



## బడికి పోవాలంటే లిఫ్ట్ ఎక్కాల్సిందే..

వేల్పూర్, జూలై 2: వేల్పూర్ మండలంలోని అమీనాపూర్, వాడి, కొత్తపల్లి, సాహెబ్‌పేట్ గ్రామాలకు చెందిన విద్యార్థులు పైచదువులకు ఇతర గ్రామాలకు వెళ్లాల్సిందే. ఈ గ్రామాలన్నింటికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో సుమారు రెండు, మూడు కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితి. బస్సు నడిచే ప్రాంతం గుండా వెళ్దామనుకున్నా.. ఆ బస్సులు సమయానికి రాకపోవడంతో గత్యంతరం లేక ఇలా లిఫ్ట్(ఇతరుల బైక్)ను ఆశ్రయించక తప్పదు.



బస్సు కోసం బస్టాండ్‌లో విద్యార్థులు, సమయానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో లిఫ్ట్‌పైన పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

## బస్సులు టైమ్‌కు రావు..

నవీపేట, జూలై 2: నేను నవీపేట పాలిటెక్నిక్‌లో సివిల్ రెండో సంవత్సరం చదువుతున్నాను. ప్రతిరోజు నిజామాబాద్ నుంచి నవీపేటకు మా కాలేజీకి చెందిన 30మంది విద్యార్థులం ఆర్టీసీ బస్సులో వస్తాం. బస్సులు సమయానికి రాకపోవడంతో కాలేజీకి నిర్ణీత సమయానికి చేరుకోవడం లేదు. దీంతో తరగతులను మిస్సవుతున్నాం. కాలేజీ నుంచి ఇంటికి వెళ్లే టైములో కూడా బస్సులు లేక ఒక్కోసారి రాత్రి ఏడుగంటల వరకు బస్టాండ్‌లోనే ఉండాల్సి వస్తున్నది.

**- ఎస్‌కే ఖాయనొద్దీన్, విద్యార్థి, పాలిటెక్నిక్ కళాశాల, నవీపేట**



వేలాడక తప్పదు





నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం దాస్‌నగర్ చౌరస్తా వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సు ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణిస్తున్న విద్యార్థులు, బస్సులు సరైన సమయానికి రాకపోవడంతో ఆటోలో కిక్కిరిసి వెళ్తున్న విద్యార్థులు

**విద్యార్థులకు తప్పని ఇక్కట్లు**

బోధన్ ప్రాంతంలో గ్రామాల నుంచి పట్టణాలకు, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు వచ్చే విద్యార్థులకు సమయానికి రాని బస్సులు, చాలీచాలని బస్సు ట్రిప్‌లతో ఇబ్బందులు తప్పడం లేదు. డివిజన్‌లో బోధన్, నిజామాబాద్, బాన్సువాడ డిపోలు బస్సులను నడుపుతున్నాయి. నిజామాబాద్ నగరంలోని డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలకు బోధన్, ఇతర మండల కేంద్రాల నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున వెళ్తుంటారు. నిజామాబాద్ వెళ్లే బస్సులు రద్దీగా ఉంటున్నాయి. బస్సుల కోసం నిరీక్షించడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు అంటున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికీ అనేక గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడం గమనార్హం. బోధన్ మండలంలోని తగ్గెల్లి, ఫత్తేపూర్, నర్సాపూర్ గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. గతంలో తగ్గెల్లికి, నర్సాపూర్‌లకు బస్సులు నడిపేవారు. ఎడపల్లి మండలంలోని జైతాపూర్, బ్రాహ్మణ్‌పల్లి, కోటగిరి మండలం రాంపూర్ తదితర గ్రామాలకు బస్సులు నడపడంలేదు. ఇదే విషయమై బోధన్ డిపో మేనేజర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా తమ డిపో పరిధిలో బస్సుల విషయంలో ఇబ్బందులు లేవని, సమయానికి అన్ని రూట్లలో బస్సులు నడుపుతున్నామని, సమస్య తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు.



## కేసీఆర్‌తో జడ్పీ చైర్మన్ దంపతులు

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మంగళవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ నెల 4వతేదీతో పదవీకాలం ముగుస్తుండడంతో జడ్పీ చైర్మన్లతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విఠల్‌రావుకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం కుటుంబీకులతో కలిసి జడ్పీ చైర్మన్ విఠల్‌రావు.. కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

– ఖలీల్‌వాడి, జూలై 2


## కేసీఆర్ సహకారంతో బాన్సువాడ అభివృద్ధి

- నేతలకు నిజాయితీ, నిబద్ధత ముఖ్యం
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్య

బాన్సువాడ, జూలై 2: మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. అప్పట్లో కేసీఆర్ అడిగినన్ని నిధులు ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను కాంగ్రెస్ పార్టీలో చేరాను తప్పితే పదవుల కోసం కాదని తెలిపారు. అధికార పార్టీలో చేరిన పోచారంను సీనియర్ నేత కాసుల బాల్‌రాజు మంగళవారం బాన్సువాడలోని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాజీ స్పీకర్ మాట్లాడారు. ఏ పార్టీలో ఉన్నా నిజాయితీ, నిబద్ధత ముఖ్యమని, ఏం చెబుతామో అదే చేయాలన్నారు. అందరినీ కలుపుకొని పోతానని, ఏకపక్ష నిర్ణయాలు ఉండవన్నారు. కాసుల బాల్‌రాజుకు రాష్ట్ర స్థాయిలో ఉన్నత పదవి రాబోతున్నదని చెప్పారు.

**మీకెందుకు కడుపు నొప్పి?**

ఎప్పుడైనా లోకల్ లోకలే అని, బయటి నుంచి వచ్చిన వారు అద్దెకు ఉండేవారు మాత్రమేనని పోచారం వ్యాఖ్యానించారు. బాల్‌రాజుకు కార్పొరేషన్ చైర్మన్ పదవి వస్తే వాళ్లకు కడుపునొప్పి ఎందుకని ప్రశ్నించారు. తనకు బయట ఒకటి, లోపల ఒకటి ఉండదన్నారు. శ్రీనన్నది మాట గట్టిగా ఉన్నా మనస్సు మెత్తనిదని కాసుల బాల్‌రాజు అన్నారు. పోచారం చేరిక గురించి సీఎం రేవంత్ ఫోన్ చేసి అభిప్రాయం అడిగారని, ఇద్దరం కలిసి బాగా పని చేస్తామని చెప్పానన్నారు. కొంత మంది దుష్ట శక్తుల నుంచి పార్టీని కాపాడుకోవాలంటే పోచారం కాంగ్రెస్‌లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

## గుక్కెడు నీటికీ కటకట..



పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

*పాఠశాల ఎదుట ధర్నాకు దిగిన విద్యార్థుల తల్లిదండ్రులు*

ఎడపల్లి, జూలై 2: ప్రభుత్వ పాఠశాలలో నీటి ఇబ్బందులపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగిన ఘటన ఎడపల్లి మండలం ఠాణాకలాన్‌లో చోటు చేసుకున్నది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 15 రోజులుగా తాగడానికి, కాలకృత్యాలు తీర్చుకునేందుకు నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం పాఠశాలకు చేరుకొని హెచ్‌ఎం నరేందర్‌తో వాదనకు దిగారు. ప్రధానోపాధ్యాయుడి నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల ఆవరణలోనే వాటర్‌ట్యాంక్ ఉండి అండర్ గ్రౌండ్ పైపుల ద్వారా నీటి సరఫరా అయ్యేదని, పైపులన్నీ మట్టితో జామ్ అవ్వడంతో 15రోజులుగా నీటి సరఫరా లేదన్నారు. దీంతో విద్యార్థులు తాగడానికి ఇంటి నుంచి బాటిళ్లలో నీటిని తెచ్చుకుంటున్నారని తెలిపారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నదని, పాఠశాల పక్కనే ప్రధాన రోడ్డు ఉండడంతో విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ పాల్దా భాస్కర్ రెడ్డి పాఠశాలకు చేరుకొని తల్లిదండ్రులను శాంతింపజేశారు. ఈ విషయమై ఎంఈవో రామారావును హెచ్‌ఎం సంప్రదించగా రేపటిలోగా నీటి సరఫరా మెరుగుపరుస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన విరమించారు.